నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, మంగళవారం 1 ఏప్రిల్ 2025 | JAGTIAL

## పోచమ్మతండాకు భగీరథ జలాలు

### పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి



భగీరథ నీరు పట్టుకుంటున్న మహిళ

నమస్తే ఎఫెక్ట్

ఎల్లారెడ్డిపేట, మార్చి 31: కొంతకాలంగా మిషన్ భగీరథ పైప్‌లైన్ సమస్య కారణంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గుండారంలో పోచమ్మ తండావాసులు ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలో పండుగపూట మంచినీళ్ల కోసం నిరసన శీర్షిక పేరిట సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఆదేశాలతో సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నించారు. సీసీరోడ్డు నిర్మాణ సమయంలో తెగిన పైప్‌లైన్‌ను గుర్తించేందుకు ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తీసి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు. సాయంత్రం భగీరథ ట్యాంకును నింపి, ఇంటింటికీ నీటిని సరఫరా చేయగా తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

## తారు లేచింది.. కంకర తేలింది!

జూలపల్లి, మార్చి 31 : గ్రామాల్లో రహదారులపై తారు లేచి, కంకర తేలి, గుంతలు, పగుళ్లుపడి అధ్వానంగా మారుతున్నాయి. దెబ్బతిన్న రోడ్లపై ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని వడ్కాపూర్-ధూళికట్ట, నాగులపల్లి-చీమలపేట, పెద్దాపూర్, తేలుకుంట, చీమలపేట, జూలపల్లి-అబ్బాపూర్ గ్రామాల మధ్య రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోవడంతో శిథిలమైంది. రహదారులపై గుంతలు తప్పించుకుంటూ ఎదురెదురుగా వచ్చే వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. చీకట్లో రోడ్డు సక్రమంగా కనిపించక అవస్థలు పడుతున్నారు.



వడ్కాపూర్-ధూళికట్ట గ్రామాల మధ్య దెబ్బతిన్న తారురోడ్డు

## ఈద్ ముబారక్



కరీంనగర్: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

*కరీంనగర్ కమాన్ చౌరస్తా, మార్చి 31 : 'ఈద్-ఉల్-ఫితర్'ను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా నెలపాటు కొనసాగిన ఉపవాస దీక్షలను ఆదివారం సాయంత్రం ముగించారు. సోమవారం ఉదయమే కొత్త బట్టలు ధరించి, ఈద్గాలు, మసీదుల వద్దకు చేరుకొని సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని 'ఈద్ ముబారక్' అంటూ పరస్పర శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల ముస్లింలకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, ప్రముఖులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.*

## వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలి



కరీంనగర్: ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

పెద్దపల్లి కమాన్, మార్చి 31 : కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని ముస్లింలు వ్యతిరేకిస్తున్నారు. సోమవారం ఈద్గాల వద్ద ప్రార్థనల అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ బిల్లుతో స్వయం ప్రతిపత్తి కోల్పోతామని, ఆ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని నినదించారు. వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

## వారంలోగా ఎల్‌ఎండీలో 13 టీఎంసీలు నిల్వ చేయండి

- లేకుంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తాం
- నగర ప్రజలను ఇబ్బంది పెడితే ఆందోళనే
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- ఎల్ఎండీలో నీటి మట్టం పరిశీలన



ఎల్‌ఎండీలోని నీటిమట్టాన్ని పరిశీలించి వస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 31: నగర ప్రజలకు వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, వారంలోగా ఎల్‌ఎండీ ప్రాజెక్టులో 13టీఎంసీల నీరు నిల్వ చేయాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 5.7టీఎంసీల నీరు మాత్రమే ఉందని, అందులో 2.5 టీఎంసీలు డెడ్ స్టోరేజీగా ఉంటుందని చెప్పారు. ఉన్న 3టీఎంసీలతో నగరానికి వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చూడడం అసాధ్యమేనని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయకుంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎల్‌ఎండీ డెడ్ స్టోరేజీకి పడిపోతున్న విషయం తెలుసుకుని సోమవారం ఆయన జలాశయాన్ని పరిశీలించి, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమైక్య రాష్ట్రంలో తాగునీటి కోసం యుద్ధాలు చేసిన పరిస్థితులు ఉన్నాయని, తానే ఎమ్మెల్యేగా 2012లో నగర తాగునీటి కోసం పోరాటం చేసి, కిందికి నీరు విడుదల చేయకుండా ఇసుక బస్తాలు వేసి అడ్డుకున్నామని గుర్తు చేశారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత కేసీఆర్ పాలనలో తాగునీటి కోసం యుద్ధాలు చేసే పరిస్థితి ఎప్పుడు రాలేదన్నారు. కరీంనగరంలో రోజు తప్పించి రోజు ఇచ్చే పరిస్థితి నుంచి ప్రతిరోజూ నీరు అందించే స్థాయికి చేరుకున్నామని తెలిపారు. తాగు, సాగునీటికి ఇబ్బంది ఉండకుండా ఉండాలంటే ఎల్‌ఎండీలో ఎట్టి పరిస్థితుల్లోనూ 13టీఎంసీలకు తగ్గకుండా నీటిమట్టం ఉండాలని 2017అక్టోబర్ 30న జీవో నంబర్ 885ను జారీ చేశామన్నారు. ఎల్‌ఎండీలో ఇప్పుడు 5.70 టీఎంసీ నీరు మాత్రమే ఉందని, అందులో 2.5టీఎంసీ డెడ్ స్టోరేజ్ అని పేర్కొన్నారు. ఇక మిగిలింది మూడు టీఎంసీల నీరేనని.. దాని ద్వారా తాగు, సాగునీటి అవసరాలను ఎలా తీర్చుతారో ప్రజలకు చెప్పాలన్నారు. ఎల్ఎండీ నుంచి కిందికి నీటిని విడుదల చేసే గడువు నేటితో ముగియాల్సి ఉన్నా.. ఇరిగేషన్ అధికారులు మరో మూడు రోజులు పొడిగించడంతో నీటిమట్టం మరింత పడిపోతుందన్నారు. ఇరిగేషన్ అధికారులు ఎల్‌ఎండీలో నీటిమట్టం తగ్గిపోతుందని, నగరానికి సంబంధించి నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని నగరపాలక అధికారులకు లేఖ రాశారని పేర్కొన్నారు. ఇప్పుడు నగరపాలక అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు. గత నెల రోజులుగా నగరంలోని అనేక ప్రాంతాల్లో రోజు నీటి సరఫరాను బంద్ చేసి రోజు తప్పించే రోజు నీటి సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే బూస్టర్ పంపులను ఆన్ చేసి నీటి సరఫరా చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఎల్‌ఎండీలో ఉన్న మూడు టీఎంసీల నీటితో వచ్చే మూడున్నర నెలల పాటు నగరానికి ఎలా ఇబ్బందులు లేకుండా మంచి నీటి సరఫరా అందిస్తారని నిలదీశారు. ఎండలు పెరిగే కొద్ది నీరు ఆవిరి అవుతుందని, దీంతో నీటిమట్టం మరింత తగ్గుతుందన్నారు. మధ్యమానేరులో 9, ఎల్లంపల్లిలో 9, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 16టీఎంసీలు నీరు ఉందని, ప్రభుత్వం వెంటనే కళ్లు తెరిచి నగరపాలకసంస్థ పరిధిలో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కరీంనగర్ నియోజకవర్గంలో సాగునీరు అందించలేక పొలాలను ఎండబెట్టారని.. తాగునీరు లేక ప్రజల్ని ఎండబెట్టవద్దన్నారు. మార్చి 31 నాటికే తాగునీటి పరిస్థితి ఇలా ఉంటే.. రానున్న వేసవిలో ఇంకా ఎలాంటి ఉంటుందోనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న నీటితో నగరానికి పూర్తి స్థాయిలో తాగునీరు అందించలేరని విమర్శించారు. మరో వారం గడువు మాత్రమే ఇస్తామని, వెంటనే ఎల్ఎండీలో నీటిమట్టాన్ని పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధ్యమానేరు నుంచి వస్తున్న 2,500 క్యూసెక్కుల నీరు ఏ మాత్రం సరిపోదన్నారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఎల్ఎండీ నుంచి నీటిని కిందికి వదలకుండా బస్తాలతో అడ్డుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఇప్పటికే ఆ పని చేయాల్సినా ఉన్నా.. కింది ప్రాంతాలు కూడా తెలంగాణ వాసులేనని అక్కడ పంట పొట్టకు వచ్చిన దశలో ఉందని నీటిని వదులుతున్న ఉద్యమించడం లేదన్నారు. ప్రభుత్వం కళ్లు తెరిచి వెంటనే నగర నీటి ఇబ్బందులు రాకుండా చూడాలని, లేకపోతే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రజల తరుపున ఉద్యమాలు చేయాల్సి వస్తుందన్నారు. కేసీఆర్ పాలనలో నగరంలో మహిళలు నీటి కోసం బిందెలు తీసుకొని రోడ్లపైకి వచ్చే పరిస్థితి రాలేదని, ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు వస్తే చూస్తూ ఊరుకునేది లేదని, తాము పోరాటం చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. నగర బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్లు రాజేందర్‌రావు, ఐలేందర్, వాల రమణారావు, మేచినేని అశోకరావు, మాజీ ప్రజాప్రతినిధులు సంపత్‌రావు, తిరుపతినాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఎండీలో అడుగంటిన జలాలు

## అడుగంటిన ఎల్‌ఎండీ

**లోయర్ మానేరు డ్యాం అడుగంటుతున్నది. నీటిమట్టం ఏకంగా 5.706 టీఎంసీలకు పడిపోయింది. డెడ్ స్టోరేజీ 2.096 టీఎంసీలు పోను మిగిలిన 3.610 టీఎంసీలతో మూడు నెలలు గడిచేదెలాగనే ఆందోళన నెలకొన్నది. మిషన్ భగీరథ ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 494 ఆవాసాల పరిధిలో ఉన్న 12 లక్షల మంది దాహం తీరుస్తున్న ఈ జలాశయం అడగంటితే రాబోయే మూడు నెలలు తాగునీటికి ఇబ్బంది తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో సోమవారం ఎల్‌ఎండీని సందర్శించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఎల్లంపల్లి నుంచి మిడ్‌మానేరుకు, అక్కడి నుంచి ఎల్‌ఎండీకి నీటిని తరలించి తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 885 ప్రకారం ఎల్‌ఎండీలో 13 టీఎంసీల నీటిని నిత్యం నిల్వ ఉంచాలని కోరారు.**

- ప్రస్తుతం ఉన్నవి 5.706 టీఎంసీలే
- డెడ్ స్టోరేజీ 2.096 టీఎంసీలు పోను మిగిలింది 3.610 టీఎంసీలే
- మిషన్ భగీరథకు ప్రతి రోజూ 143 క్యూసెక్కులు
- అందులో కరీంనగర్‌కే 63 క్యూసెక్కులు
- మూడు నెలలు 12 లక్షల మంది దాహం తీరేదెలా..?
- తాగునీటికి తిప్పలు తప్పవా..?

కరీంనగర్, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : లోయర్ మానేరు డ్యాం (ఎల్‌ఎండీ) పూర్తి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా, గతేడాది డిసెంబర్ 31 నాటికి 22.870 టీఎంసీల నీరు ఉన్నది. ఈ యేడాది జనవరి ఒకటి నుంచి యాసంగి పంటలకు నీటిని ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేసింది. ఎల్‌ఎండీ నుంచి 19.578 టీఎంసీలకుతోడు మిడ్ మానేరు ద్వారా 10.996 టీఎంసీలను తరలించి దిగువ ఆయకట్టుకు 30.524 టీఎంసీలు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. జనవరి ఒకటిన 4 వేల క్యూసెక్కులతో దిగువ ఆయకట్టుకు నీటి విడుదల ప్రారంభించి, 5,500 క్యూసెక్కులకు పెంచారు. నిజానికి ఈ నెల 31 వరకే చివరి తడికి నీటిని విడుదల చేయాల్సి ఉండగా మరో నాలుగైదు రోజుల పాటు 2,500 క్యూసెక్కులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఖమ్మం, సూర్యాపేట వరకు తరలిస్తున్నారు. అయితే, జలాశయంలో నీటి మట్టం పూర్తిగా పడిపోయింది. సోమవారం నాటికి కేవలం 5.706 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. మిడ్ మానేరు ద్వారా 3 వేల క్యూసెక్కుల నీరు వస్తున్నది. ఈ జలాశయంలోనూ ఆశించిన నీరు లేదు. ఏప్రిల్ 10 వరకు ఇదే స్థాయిలో ఎల్‌ఎండీకి నీటిని తరలిస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ ఎంత వరకు కార్యరూపం దాల్చుతుందనేది అనుమానంగానే ఉన్నది. నిజానికి ఎల్‌ఎండీ జలాశయం 2.096 డెడ్ స్టోరేజీ కాగా, ఇప్పుడున్న 5.706 టీఎంల్లో డెడ్ స్టోరేజీపోను 3.610 టీఎంసీ నీరు మాత్రమే ఉంటుంది. దీనిని బట్టి చూస్తే వచ్చే మూడు నెలలు తాగునీటికి ఇబ్బందులు తప్పేలా లేవు.

### రోజుకు 143 క్యూసెక్కులు

నాడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ కింద చేసిన ప్రణాళికల ప్రకారంగా ఎల్‌ఎండీ జలాశయం నుంచి 3 సెగ్మెంట్లకు తాగు నీటిని అందిస్తున్నారు. అందులో కరీంనగర్- రామడుగు సెగ్మెంట్‌ను పరిశీలిస్తే 87, ఎల్‌ఎండీ, మానకొండూర్, హుజూరాబాద్, హుస్నాబాద్ సెగ్మెంట్ పరిధిలో 312, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి సెగ్మెంట్ పరిధిలో 70 చొప్పున మొత్తం 469 ఆవాసాలు ఉన్నాయి. మున్సిపాలిటీల్లో విలీనమైనవి మరో 25 కలిపి మొత్తం 494 ఆవాసాలు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రతి రోజు 143 క్యూసెక్కుల నీరు అవసరం ఉంటుంది. అందులో ఒక్క కరీంనగర్‌కే 63 క్యూసెక్కులు అవసరం. అయితే, ఎల్‌ఎండీకి యాసంగి నీటి ప్రణాళికలో భాగంగా మిషన్ భగీరథకు 3.852 టీఎంసీలు కేటాయించాలని నిర్ణయించారు. కానీ, ఈరోజు వరకే చూస్తే డెడ్ స్టోరేజీ పోను 3.610 టీఎంసీలు మాత్రమే ఉన్నది. అందులో ప్రతి రోజూ 115 క్యూసెక్కులు ఆవిరి కింద తీసేస్తే తాగు నీటికి లోటు స్పష్టంగా కనిపిస్తున్నది. దీనికి తోడు మరో నాలుగైదు రోజులు దిగువ ఆయకట్టుకు సాగు నీటిని సరఫరా చేస్తే జలాశయంలో మరింత నీటి మట్టం పడిపోయి తాగు నీటికి తీవ్ర ఇక్కట్లు తప్పవనేది స్పష్టమవుతున్నది.



ఎల్‌ఎండీలో తేలిన హైదరాబాద్ పాత రోడ్డు

### ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా?

కరీంనగర్‌తోపాటు 494 అవాసాల పరిధిలో ఉన్న 12 లక్షల మంది దాహం తీర్చే ఎల్‌ఎండీ జలాశయంలో నీటి మట్టం పూర్తిగా పడిపోతున్నదని నీటి పారుదల శాఖ అధికారులు ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయాన్ని సోమవారం ఎల్‌ఎండీని సందర్శించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కూడా స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగించుకోని కారణంగా ఇప్పుడు ఎల్లంపల్లిలో, దానిపై ఆధారపడిన మధ్యమానేరులోనూ ఆశించిన నీరు లేదని, ఎల్‌ఎండీకి ఎలా తరలిస్తారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. నిజానికి ఎల్‌ఎండీలో 905.18 అడుగుల లెవల్లో 13.156 టీఎంసీల నీటిని నిత్యం నిల్వకు ఉంచాలని 2017 అక్టోబర్ 30న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో నంబర్ 885ను జారీ చేసింది. ఎల్‌ఎండీ దిగువ ప్రాంతంలో ఎక్కడ ఎలాంటి సమస్య ఎదురైనా ఈ నీటిని వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఇచ్చిన ఈ జీవోను ప్రస్తుత ప్రభుత్వం తుంగలో తొక్కింది. నీటి లభ్యత ఉన్న సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోయకుండా ఇటు సాగునీటికి, అటు తాగునీటికి ఇబ్బందులు పడే పరిస్థితి కొని తెచ్చుకున్నదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఎల్‌ఎండీ నీటి మట్టం పడిపోతే కరీంనగర్‌కు తాగునీటి సమస్యలు తలెత్తుతాయని మున్సిపల్ ఉన్నతాధికారులు నీటి పారుదల శాఖకు పలుసార్లు లేఖల ద్వారా విన్నవించినట్టు తెలుస్తున్నది. ఇదే విషయాన్ని ఇరిగేషన్ అధికారులు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తాగునీటి అవసరాలకు నీటిని నిల్వ చేయాల్సిన అవసరం ఉందని సూచించినట్టు తెలిసింది. అయినా, డెడ్ స్టోరేజీ వరకు దిగువ ఆయకట్టుకు నీటిని విడుదల చేయడంతో అధికారులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొన్నది.

## నేటి నుంచే నిరవధిక సమ్మె

- పవర్‌లూం, వార్పిన్, వైపని కార్మికులు విజయవంతం చేయాలి
- పది శాతం యారన్ సబ్సిడీ అందించాలి
- తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్



మాట్లాడుతున్న మూషం రమేశ్

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 31: కార్మికులకు రావాల్సిన పది శాతం యారన్ సబ్సిడీ అందించాలని, ప్రభుత్వం ఉత్పత్తి చేస్తున్న చీరలకు కూలీ నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నామని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ డిమాండ్ స్పష్టం చేశారు. పవర్‌లూమ్, వార్పిన్, వైపని కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిరిసిల్ల బీవైనగర్‌లోని అమృత్ లాల్ శుక్లా కార్మిక భవనంలో సోమవారం పవర్‌లూమ్, వార్పిన్, వైపని రంగాల ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉత్పత్తి చేయిస్తున్న మహిళా పొదుపు సంఘాల చీరల ఉత్పత్తి పనులు ప్రారంభమైనా.. ఇప్పటివరకు పవర్‌లూం, వార్పిన్, వైపని కార్మికులకు కూలి నిర్ణయించకపోవడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం నెలకొన్నదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ చీరలకు ఒక మీటర్‌కు కూలీ రూ.5.25 పైసలు యారన్ సబ్సిడీ కింద ఒక మీటర్‌కు రూ.1.42 పైసలు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ చీరలకు సంబంధించి కార్మికులకు ఎంత కూలీ తెలియని పరిస్థితి నెలకొందన్నారు. వర్కర్ టూ ఓనర్ పథకానికి సంబంధించి షెడ్ల నిర్మాణం పూర్తయి ఏండ్లు గడుస్తున్నా ఈ పథకాన్ని అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. మంగళవారం ఉదయం 9గంటలకు బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయం వద్దకు పవర్‌లూం, వార్పిన్, వైపని కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, ఉపాధ్యక్షుడు గుండు రమేశ్, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, ఉడుత రవి, వైపని వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కుమ్మరికుంట కిషన్, ఒగ్గు గణేశ్, సబ్బని చంద్రకాంత్, భాస శ్రీధర్, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, కమలాకర్, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.



ఎగిసిపడుతున్న మిషన్ భగీరథ జలం

## కారు బీభత్సం.. ఎగిసిపడిన జలం

ముకరంపుర, మార్చి 31: కరీంనగర్‌లోని రేకుర్తి-శాతవాహన యూనివర్సిటీ ప్రధాన రహదారిలో సోమవారం ఓ కారు బీభత్సం సృష్టించింది. అంబేద్కర్ చౌరస్తా నుంచి శాతవాహన యూనివర్సిటీకి వెళ్లే మార్గంలో కొత్తవాడ వద్ద అదుపు తప్పి మిషన్ భగీరథ ప్రధాన పైప్ లైన్ వాల్వ్‌ను బలంగా ఢీకొట్టింది. కారు వేగం ధాటికి పైప్‌లైన్ వాల్వ్ విరిగి పడిపోగా.. అధిక ఒత్తిడితో నీరు భారీగా ఎగిసిపడింది. కారు డ్రైవర్ నియంత్రణ కోల్పోయి అదే వేగంతో పక్కనే ఉన్న కూరగాయల దుకాణాన్ని ఢీకొట్టడంతో కూరగాయలు చెల్లాచెదురుగా పడిపోయాయి. దుకాణంలో ఉన్న ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పట్టుకున్నారు. వాల్వ్ లీకేజీతో సమీప ప్రాంతాలు జలమయం కాగా, స్థానికులు ఎలగందులలోని మిషన్ భగీరథ ప్రధాన పంపింగ్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో నీటి సరఫరాను నిలిపివేశారు. కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాలతోపాటు చొప్పదండి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సాయంత్రంలోగా మిషన్ భగీరథ సిబ్బంది వాల్వ్‌కు మరమ్మతులు చేశారు.



చందర్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ప్రజాప్రతినిధులు

## చందర్.. ఎలా ఉన్నావ్!

### మాజీ ఎమ్మెల్యేకు పలువురి పరామర్శ

గోదావరిఖని, మార్చి 31 : అనారోగ్యంలో గత మూడు రోజులుగా మంచిర్యాలలోని ఓ ప్రైవేటు దవాఖానలో చికిత్సపొందుతున్న రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను సోమవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్యేలు దివాకర్ రావు, పుట్ట మధుకర్ పరామర్శించారు. 'చందర్.. ఎలా ఉన్నావ్' అంటూ ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.